KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 | సంచిక 195 | మంగళవారం 17 జూన్ 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 | వెల: 3 రూ/-



# అరెస్ట్ చేస్తే చేసుకోండి

●ఫార్ములా ఈ కేసులో ఏసీబీ ఎదుట కేటీఆర్ విచారణ:7 గంటల పాటు 60 ప్రశ్నలు! ● ఎటువంటి అవినీతి జరగలేదు,ఒక్క రూపాయి కాదు, ఒక్క పైసా కూడా పోలేదు..!●లొట్టపీసు కేసు.. లొట్టపీసు సీఎం! ● జైలుకు పంపినా సంతోషంగా వెళ్తా, అభివృద్ధి కోసం మరో 10 కేసులైనా భరిస్తా ●వచ్చే లోకల్ బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చుక్కలు చూపించాలి - బీఆర్ఎస్ పిలుపు ● విచారణ అనంతరం తెలంగాణ భవన్ చేరిన కేటీఆర్, కార్యకర్తలకు భరోసా 2 లో

తెలంగాణ రాష్ట్రంలో హాట్ టాపిక్ గా మారిన ఫార్ములా ఈ కార్ రేస్ కేసు లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారణ హాజరయ్యారు. ఈ విచారణలో కేటీఆర్ ఉదయం నుంచి దాదాపు 7 గంటల పాటు 60 ప్రశ్నలను ఏసీబీ సంధించినట్లు తెలుస్తోంది. అవసరమైతే మరోసారి పిలుస్తామని, విచారణకు అందుబాటులో ఉండాలని సమాచారం ఇచ్చినట్లు తెలిపింది. విచారణ అనంతరం నేరుగా తెలంగాణ భవన్ చేరుకున్న కేటీఆర్.. పార్టీ నేతలు, కార్యకర్తలతో ముచ్చటించిన తర్వాత సంచలన ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విచారణలో అడిగిన ప్రశ్నలనే అటు, ఇటు తిప్పి అడిగారని అన్నారు. అలాగే తాను ఏసీబీ అధికారులను అడిగిన ప్రశ్నలకు ఎటువంటి సమాధానం లేదని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రాసిచ్చిన ప్రశ్నలనే పదే పదే అడిగారని, ఎటువంటి అవినీతి జరగలేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఇది ఒక లొట్టపీసు కేసు అని, సీఎం ఓ లొట్టపీసు సీఎం అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సీఎం రేవంత్ కు తమను ఎలాగైన జైల్లో పెట్టాలని కక్షతో ఉన్నారని విమర్శించారు. తాము ఎటువంటి తప్పు చేయలేదని ఫార్ములా ఈ కార్ రేస్ మొదటి సంవత్సరం సక్సెస్ అయిందని, రెండో సంవత్సరం కూడా ఎట్టిపరిస్థితుల్లో వేదిక మారకుండా ఉండేందుకు ముందస్తుగా నిధులు విడుదల చేశామని ఈ సందర్భంగా కేటీఆర్ ఏసీబీ అధికారులకు చెప్పినట్లు మీడియాతో చెప్పుకొచ్చారు.

## స్థానిక పోరుకు సై.. జులైలోనే లోకల్ బాడీ ఎలక్షన్లు!



2 లో

ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న స్థానిక ఎన్నికలకు ఒక అడుగు ముందుకు పడింది. ఇవాళ నిర్వహించిన మంత్రుల సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. జులైలో లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం. అయితే ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలా..? లేదా ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్ పెట్టి తర్వాత పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలా..? అన్నదానిపై కేబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇవాళ కీలక అంశాలపై చర్చ జరిగింది



2 లో

## గోదావరి పుష్కరాల నిధుల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం

తెలంగాణలో నిర్వహించే గోదావరి పుష్కరాలపై కేంద్రప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. గోదావరి పుష్కరాల నిధుల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం జరిగిందని అన్నారు. కేంద్రప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలను సమానంగా చూడాలని కోరారు. దేవాదాయ శాఖ మంత్రిగా నిధుల కేటాయింపుపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాస్తానని తెలిపారు. సోమవారం వరంగల్ జిల్లాలో మంత్రి కొండా సురేఖ పర్యటించారు.



2 లో

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి హైకోర్టులో ఊరట

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు హైకోర్టులో ఊరట కలిగింది. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం కొట్టివేసింది. 2021 నవంబర్ 15న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బండి సంజయ్ ర్యాలీ నిర్వహించారు.



# రైతును రాజుగా..

## వ్యవసాయాన్ని పండగలా చేస్తున్నాం

●రైతులకు 9 రోజుల్లో రూ 9 వేల కోట్లు రైతు భరోసా

●ఉక్కు సంకల్పంతో వ్యవసాయాన్ని నిలబెడతాం

●10 ఏళ్లు పాలించి, రైతుల మీద నాటకాలు ఆడుతున్నారు

●ప్రజా ప్రభుత్వం మొదలయ్యాకే నిజమైన రుణమాఫీ జరిగింది - సీఎం రేవంత్ రెడ్డి

ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో జరుగుతున్న రైతు నేస్తం కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. వివిధ జిల్లాలకు చెందిన రైతులతో ముఖాముఖి ప్రోగ్రాంలో మాట్లాడి.. వారి విజయాలను, వినతులను విన్నారు. రైతును రాజుగా చేయడమే కాదు, వ్యవసాయాన్ని పండగ చేసేందుకు ఉక్కు సంకల్పాన్ని తీసుకున్నాం. రైతును పట్టించుకోని వారు రాష్ట్రంలో, దేశంలో నాయకులు ఏ పదవి చేపట్టాలన్నా రైతుల అండ ఉండాలని అన్నారు. 10 ఏళ్లు తెలంగాణను పాలించి రైతుల పేరుతో వీధి నాటకాలు ఆడుతున్నారు.

రైతులను నట్టేట ముంచిన వారు తమపై బురద జల్లుతున్నారని అన్నారు. 2014లో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని ఎగ్గొట్టి రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తాము రైతులకు రుణమాఫీ అందజేశామని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో వరి వేస్తే బోనస్ ఇస్తున్నాం అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా సరే రైతులు ఇబ్బందులు పడకూడదు అని రైతు భరోసా ఇస్తున్నామని పేర్కొన్నారు. రానున్న 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల నిధులను రైతుల అకౌంట్లలో జమ చేస్తామని అన్నారు. 2 లో

# మంత్రి పొంగులేటిపై చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సీరియస్..!



● స్థానిక సంస్థల ఎన్నికల వ్యాఖ్యలపై మంత్రులకి హెచ్చరికలు● రెవిన్యూ మంత్రి వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేసిన టీపీసీసీ చీఫ్ ● కోర్టు పరిధిలో ఉన్న విషయాలపై మంత్రుల వ్యాఖ్యలు కరెక్ట్ కాదని మహేష్ గౌడ్ స్పష్టం ● ప్రభుత్వ, పార్టీ పరువు దెబ్బతినకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి: టీపీసీసీ చీఫ్ 2 లో

## యువత తగిన ఉద్యోగం చేయాలనే స్కిల్ యునివర్సిటీ ఏర్పాటు

: మంత్రి శ్రీధర్ బాబు



2 లో

●తెలంగాణను 'స్కిల్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్'గా తీర్చిదిద్దుతాం: శ్రీధర్ బాబు ●స్కిల్, జాబ్, లోన్ మేళా ప్రారంభించిన జయంత్ చౌదరి, శ్రీధర్ బాబు ●యువత శిక్షణ కోసం కొత్త కోర్సులు తీసుకురానున్నాం: రాష్ట్ర మంత్రి ప్రకటన ● స్కిల్ యూనివర్సిటీకి పూర్తి మద్దతు ఇస్తాం: కేంద్ర మంత్రి జయంత్ హామీ

## హైదరాబాద్ అభివృద్ధికి అడ్డుగా కేంద్ర ప్రభుత్వం - మంత్రి పొన్నం


హైదరాబాద్ లోని జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు నిర్వహించిన ధర్నాపై తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. జీహెచ్ఎంసీ అభివృద్ధిపై బీజేపీ చేస్తున్న విమర్శలను మంత్రి ఖండించారు. ఈ విషయమై మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీజేపీ నేతలు ధర్నా చేయాల్సింది జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు కాదు.. హైదరాబాద్ నగరం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేయాలని మండిపడ్డారు.




2 లో

## నేటి మాట

పుటుక నీది.. చావు నీది..
బ్రతుకంతా దేశానిది!!



- కాళోజి నారాయణ రావు



2 లో

## ఇది మంచి ప్రభుత్వం కాదు ముంచే ప్రభుత్వం..

### రోజా హాట్ కామెంట్స్!

కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి ఆర్కే రోజా హాట్ కామెంట్స్ చేశారు. ఇది మంచి ప్రభుత్వం కాదని.. ముంచే ప్రభుత్వం అని విమర్శించారు. 143 హామీలతో పాటు సూపర్ సిక్స్ ఇస్తామని చెప్పి.. ఒక పథకంను కూడా అమలు చేయడానికి వారికి మనసు రాలేదని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు సూపర్ అమలు చేశామని చెప్పడంపై ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఉలిక్కిపడ్డారన్నారు.

## రేవంత్ ప్రభుత్వం వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేసింది: హరీష్‌రావు

●కోవిడ్ కిట్లు లేని పరిస్థితి రాష్ట్రంలోనే ఉందంటూ ప్రభుత్వంపై హరీష్ రావు ధ్వజం ● రుణమాఫీ నుంచి రైతు భరోసా వరకు ప్రభుత్వం స్పష్టతలేని పాలన సాగిస్తోంది ● గోదావరి-బనకచర్ల అంశంలో తాను డాక్యుమెంట్ల ఆధారంగానే మాట్లాడుతున్నా ● సొంత ప్రభుత్వంపైనే తిరుగుబాటు?- కాంగ్రెస్ ఎమ్మెల్యేల హైకోర్టు దాఖలుపై హరీష్ రావు వ్యాఖ్యలు



2 లో

మన క్రాంతి KR TV ఇది వాస్తవ పత్రిక...



## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి హైకోర్టులో ఊరట

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు హైకోర్టులో ఊరట కలిగింది. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం కొట్టివేసింది. 2021 నవంబర్ 15న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బండి సంజయ్ ర్యాలీ నిర్వహించారు. అనుమతి లేకుండా భారీ వాహనాలతో కాన్వాయ్ నిర్వహించారని ఎన్నికల అధికారి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉండగా.. తాజాగా హైకోర్టు కొట్టివేసింది.

## గోదావరి పుష్కరాల నిధుల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సత్యశారదాదేవి, మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి కొండా సురేఖ మాట్లాడారు.

బీఆర్ఎస్ హయాంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో తట్టెడు మట్టి కూడా పోయలేదని మంత్రి కొండా సురేఖ చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. భూ కబ్జాదారులే గతంలో పరిపాలన చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. పేదల కలలు సాకారం కావాలంటే ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

## ఇది మంచి ప్రభుత్వం కాదు, ముంచే ప్రభుత్వం.. రోజా హాట్ కామెంట్స్!

మొదటి పేజీ తరువాయి

ఒక్క పథకంను అమలు చేయకుండా, ఒక్క అభివృద్ధి పని చేయకుండా.. అన్ని చేశామని చంద్రబాబు చెప్పడంపై ప్రజలు తమను తాము గిల్లి మరీ చూసుకుంటున్నారన్నారు. 30 లక్షల మంది తల్లులకు 'తల్లికి వందనం' ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని రోజా మండిపడ్డారు. సోమవారం తిరుపతిలో మాజీ మంత్రి ఆర్కే రోజా మీడియాతో మాట్లాడారు.

'143 హామీలతో పాటు సూపర్ సిక్స్ ఇస్తామని చెప్పి ఒక పథకంను అమలు చేయడానికి వారికి మనసు రాలేదు. సీఎం చంద్రబాబు సూపర్ అమలు చేశామని చెప్పడంపై ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఒక్క పథకంను అమలు చేయకుండా, ఒక్క అభివృద్ధి పని చేయకుండా.. అన్ని చేశామని చంద్రబాబు చెప్పడంపై ప్రజలు తమను తాము గిల్లి మరీ చూసుకుంటున్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదు, అమ్మ ఒడి ఇవ్వలేదు, విద్యాదీవెన ఇవ్వలేదు.. ఇలా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. వైఎస్ జగన్ పొదలి పర్యటనకు వచ్చిన ప్రజలను చూసి భయపడి రాత్రి 'తల్లికి వందనం' జీవో విడుదల చేశారు. 30 లక్షల మంది తల్లులకు తల్లికి వందనం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసింది. తల్లికి వందనం పథకం కాదు తల్లికి కోతల పథకం అది' అని ఆర్కే రోజా విమర్శించారు.

'ఒకే అకౌంట్లో, ఒకే ఆధార్ నెంబర్తో 80-100 మంది పిల్లలకు ఎలా డబ్బులు పడ్డాయి?.. ఈ డబ్బులు ఎక్కడికి వెలుతున్నాయి. కెమెరాల ముందు సవాలు చేయడం, తొడలు కొట్టడం కరెక్ట్ కాదు. నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా ఉండటంతో ఎంతో మంది పిల్లల జీవితాలు నాశనమయ్యాయి. సవాల్ చేయడానికి లోకేష్ గారికి ఏ అర్హత ఉంది?. కేవలం పబ్లిసిటీ కోసమే పథకాలు ఇస్తూ అన్నిటిలో కోతలు విదిస్తున్నారు. రాష్ట్ర ప్రజలకు బాగా అర్థమైంది. వైఎస్ జగన్ రెడ్డిపై నోరు పారేసుకోవడం మానుకొని.. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో చిత్తశుద్ధి చూపించాలి. రెడ్ బుక్ రాజ్యాంగం పక్కనపెట్టి.. ఎల్లో బుక్ హామీలు అమలు చేయాలి. రాష్ట్రంలోకి గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా తీసుకొచ్చి జీవితాలను నాశనం చేస్తున్నారు. ఆడపిల్లల పైన అఘాయిత్యాలు జరుగుతున్నా పట్టించుకోలేదు. వైసీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. అన్నింటికీ సమాధానం చెప్పాల్సిన రోజు తొందరలోనే ఉంది. వెన్నుపోటు పుస్తకాన్ని ప్రతి ఓటర్కు అందించి.. కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని వివరిస్తాం, మీ మెడలు వంచి శిక్ష వేస్తాం' అని ఆర్కే రోజా హెచ్చరించారు.

## అరెస్ట్ చేస్తే చేసుకోండి

మొదటి పేజీ తరువాయి



అలాగే సీఎం రేవంత్ రెడ్డి కి తమను జైలుకు పంపడమో సంతోషం ఇస్తుందటంటే.. తెలంగాణ అభివృద్ధి కోసం మరో 10 కేసులు నాపై పెట్టిన బరిస్తానని, జైలుకు పంపిన సంతోషంగా వెళ్లి వస్తానని ఈ సందర్భంగా కేటీఆర్ స్పష్టం చేశారు. అతి త్వరలోనే లోకల్ బాడి ఎన్నికలు జరిగే ఉన్నాయని.. కాంగ్రెస్ పార్టీకి, నేతలకు ఎన్నికల్లో చుక్కలు చూపించాలని.. ఇదే బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తల ముందున్న లక్ష్యం అని కేటీఆర్ సూచించారు.

## స్థానిక పోరుకు సై.. జులైలోనే లోకల్ బాడీ ఎలక్షన్లు!




ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న స్థానిక ఎన్నికలకు ఒక అడుగు ముందుకు పడింది. ఇవాళ నిర్వహించిన మంత్రుల సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. జులైలో లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం. అయితే ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలా..? లేదా ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్ పెట్టి తర్వాత పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలా..? అన్నదానిపై కేబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇవాళ కీలక అంశాలపై చర్చ జరిగింది

ప్రధానంగా రైతుభరోసా, స్థానిక సంస్థల ఎన్నికలపైనే డిస్కషన్ జరిగింది. ఇవాల్టి సమావేశంలో స్థానిక ఎన్నికలపై కీలక నిర్ణయం వెలువడనుందని అంతా భావించారు. అనుకున్నట్టుగానే నిర్ణయం వెలువడినా ఏ ఎన్నికలు ముందుగా నిర్వహిస్తారనేది కేబినెట్ సమావేశంలోనే తేల్చే అవకాశం ఉంది.

ఎన్నికల సన్నద్ధతను సీఈవో కు తెలియజేస్తే రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ విడుదల చేస్తుంది. అయితే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతాయి. ఎంపీటీసీలను, జెడ్పీటీసీలను ఓటర్లు ఎన్నుకుంటారు. ఎన్నికైన ఎంపీటీసీలు మండల పరిషత్ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. అలాగే జెడ్పీటీసీలు జిల్లా పరిషత్ చైర్మన్ ను ఎన్నుకుంటారు.

పంచాయతీ ఎన్నికల విషయానికి వస్తే.. ఓటర్లు వార్డు సభ్యులకు, సర్పంచ్ కు నేరుగా ఓటు వేస్తారు. ఈ ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవు. ఇండిపెండెంట్ గుర్తులపైనే ఎన్నికలు జరుగుతాయి. వార్డు సభ్యులు ఉపసర్పంచ్ ను ఎన్నుకుంటారు. దీంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కనుంది.

## మంత్రి పొంగులేటి పై చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సీరియస్..!

స్థానిక సంస్థల ఎన్నికలపై రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల అంశంతో ముడిపడి ఉన్న ఈ ఎన్నికల విషయంలో మంత్రి పొంగులేటి ప్రకటన చేయడాన్ని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తప్పుబట్టారు. ఈ తరహా అంశాలను కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని, వాటిని ముందుగానే మీడియాకు వెల్లడి చేయడం సరైంది కాదని ఆయన అన్నారు. ఒక మంత్రిత్వ శాఖ పరిధిలోని అంశంపై వేరొకరు మాట్లాడడం అనవసరమైన మాట్లాడ్డం ఏంటని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మండిపడ్డారు.

అంతేకాదు, ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్న వివాదాస్పద అంశాలపై మాట్లాడేటప్పుడు మంత్రులు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. అలాంటి సున్నితమైన విషయాలను మీడియా ముందుకు తీసుకురావడం పట్ల పార్టీ అధిష్ఠానం అసహనం వ్యక్తం చేసింది. ఈ తరహా ప్రకటనలు పార్టీని, ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లోకి నెట్టే అవకాశం ఉన్నందున పార్టీతో సంప్రదించకుండా ఏ విధమైన ప్రకటనలు చేయొద్దని టీపీసీసీ చీఫ్ మంత్రులకు సూచించారు.

ప్రతి మంత్రి తమ శాఖ పరిధిలోని అంశాల పట్ల మాత్రమే స్పందించాలని, కోర్టు పరిధిలో ఉన్న విషయాలపై మాట్లాడేటప్పుడు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని టీపీసీసీ చీఫ్ ప్రభుత్వ మంత్రులను కోరారు.

## హైదరాబాద్ అభివృద్ధికి అడ్డుగా కేంద్ర ప్రభుత్వం.. మంత్రి పొన్నం

హైదరాబాద్ లోని జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు నిర్వహించిన ధర్నాపై తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. జీహెచ్ఎంసీ అభివృద్ధిపై బీజేపీ చేస్తున్న విమర్శలను మంత్రి ఖండించారు. ఈ విషయమై మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీజేపీ నేతలు ధర్నా చేయాల్సింది జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు కాదు.. హైదరాబాద్ నగరం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేయాలని మండిపడ్డారు.

హైదరాబాద్ నగర అభివృద్ధికి కేంద్రం నుండి ఒక్క రూపాయి కూడా తెచ్చేందుకు ప్రయత్నించకుండా బీజేపీ నాయకులు రాజకీయ స్టంట్లు వేయడం సరికాదని విమర్శించారు. నగర అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా కేంద్ర ప్రభుత్వం మారిందని, దీనికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వైఫల్యమే కారణమని తెలిపారు. జీహెచ్ఎంసీ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు.

ఎన్నికల ముందు ఈ విధమైన రాజకీయాలు చేయడం కన్నా, కిషన్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేస్తే మేము కూడా వస్తాం అని మంత్రి పిలుపునిచ్చారు. హైదరాబాద్ అభివృద్ధికి అందరం కలిసి నిధులు తీసుకురావాలన్న మంత్రి, ఈ విషయాన్ని రాజకీయాలకు దూరంగా ఉంచాలని అన్నారు. నగర అభివృద్ధి మా బాధ్యత. రాజకీయాలు దానికి అడ్డుకావద్దు అని హెచ్చరించారు. మొత్తంగా కేంద్రం నుండి నిధులు తీసుకురావడానికి బీజేపీ నాయకులు తమ సొంత నేత కిషన్ రెడ్డిపై ఒత్తిడి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

## యువత తగిన ఉద్యోగం చేయాలనే స్కిల్ యునివర్సిటీ ఏర్పాటు : మంత్రి శ్రీధర్ బాబు

యువత తగిన ఉద్యోగం చేయాలనే లక్ష్యంతో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈ మేరకు సోమవారం మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో బషీర్ బాగ్ లోని ఉస్మానియా పీజీ లా కాలేజీ లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ , స్కిల్, లోన్ మేళా" ప్రారంభోత్సవ కార్యక్రమంలో అతిథిగా కేంద్ర మంత్రి జయంతి చౌదరి, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, రాజ్య సభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, హీరావతి అనిల్ కుమార్, గాలి వినోద్ కుమార్ ప్రొఫెసర్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి జయంత్ చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి మెగా జాబ్ , స్కిల్, లోన్ మేళా" ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణను "స్కిల్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్"గా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఏర్పాటైన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి కేంద్ర సహకారం కావాలని మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరిని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధిలో కేంద్రంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. అంతే కాకుండా యువత శిక్షణకు కొత్త కోర్సులు రూపొందిస్తున్నామని తెలిపారు. యువత వారి నైపుణ్యానికి తగిన ఉద్యోగం చేయాలనే లక్ష్యంతో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు.

కేంద్రం నుండి రాష్ట్రానికి పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర మంత్రి జయంతి చౌదరి హామీని ఇచ్చారు. యువత లో నైపుణ్యం అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పని చేస్తుందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

## కరోనాపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




కరోనా పాజిటివ్ కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో హాస్పిటల్ సిబ్బందిని వైద్యాధికారులు అప్రమత్తం చేయాలని, కరోనా ప్రొటోకాల్స్‌ను ప్రజలకు మళ్లీ గుర్తు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. ప్రధాని మోడీ అన్ని నియోజకవర్గాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించాలని ఆదేశించడంతో సోమవారం ఆయన గాంధీ ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న సౌకర్యాల గురించి వారినే అడిగి తెలుసుకోవడంతో పాటు అక్కడ సౌకర్యాలు, ఏర్పాట్ల గురించి సూపరింటెండెంట్ నుంచి సమాచారం తీసుకున్నారు.

పేషెంట్ల సంఖ్య అధికంగా ఉండటంతో, అవసరమైన చికిత్సలు సదుపాయాలను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేయాలని, ఆసుపత్రిలో ఆర్ఎంఓ పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉందని, కొత్త విభాగాలు కూడా ప్రారంభమైతాయని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద, ఆధార్ ఆధారంగా పేషెంట్లకు కార్డులు జారీ చేస్తున్నారు. ఆ కార్డు ద్వారా పేషెంట్లు గాంధీ ఆసుపత్రిలోనే కాకుండా ఇతర ఆసుపత్రుల్లోనూ చికిత్స పొందే అవకాశం కల్పిస్తామన్నారు. కోవిడ్ సమయంలో ప్రధాని మోడీ ఆదేశాల మేరకు ఇక్కడ రెండు ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేశామని, అవి ఇప్పటికీ పనిచేస్తున్నాయని వెల్లడించారు. రాబోయే రోజుల్లో గాంధీ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి, సౌకర్యాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.

## రేవంత్ ప్రభుత్వం వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేసింది: హరీష్‌రావు

రేవంత్ ప్రభుత్వం వైద్యరంగాన్ని నిర్లక్ష్యం చేసిందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శలు చేశారు. వైద్య కళాశాలల్లో కనీస వసతులు లేవని ఎన్ఎంసీ లేఖ రాసిందని గుర్తుచేశారు. తెలంగాణలో కనీసం కోవిడ్ కిట్లు లేవని మండిపడ్డారు. దేశంలో 90వేల కరోనా కేసులు ఉంటే.. రాష్ట్రంలో కనీసం కోవిడ్ టెస్ట్‌లు కూడా చేయడం లేదని ధ్వజమెత్తారు. సోమవారం తెలంగాణ భవన్‌లో హరీష్‌రావు మీడియాతో చిట్‌చాట్ చేశారు.

రేవంత్ ప్రభుత్వానికి ఏ విషయంలోనూ స్పష్టత లేదని మాజీ మంత్రి హరీష్‌రావు చెప్పారు. రుణమాఫీ, రైతుభరోసా, యువవికాసం... ఇలా అన్ని అంశాల్లోనూ ప్రభుత్వానికి స్పష్టత లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేసిందేమీ లేదు... కానీ, ఎంసీఆర్ హెచ్ఆర్డీలో సీఎం క్యాంపు కార్యాలయం మాత్రం సిద్ధమైందని చెప్పుకొచ్చారు. సీఎం క్యాంపు కార్యాలయం కోసం రోడ్డును కూడా విస్తరణ చేస్తున్నారని అన్నారు. నలుగురు ఎమ్మెల్యేలు హైకోర్టుకి వెళ్లడం అంటే సొంత ప్రభుత్వంపై తిరుగుబాటు అన్నట్లేనని విమర్శించారు మాజీ మంత్రి హరీష్‌రావు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ లేకపోతే... 30టీఎంల నీళ్లు హైదరాబాద్‌కి ఎక్కడ నుంచి తీసుకువస్తారని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రశ్నించారు. గోదావరి - బనకచర్ల విషయంలో ఏపీ ప్రభుత్వం ఇచ్చిన డాక్యుమెంట్, లేఖల ఆధారంగానే తాను మాట్లాడానని స్పష్టం చేశారు. 90శాతం విషయాలపై తనకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. రేవంత్ ప్రభుత్వంలో పనిచేసే వారికి ఈ విషయాలు తెలియవు, నేర్చుకోరని ఎద్దేవా చేశారు. గోదావరి - బనకచర్ల గురించి ఇప్పటికే చాలాసార్లు తాను మాట్లాడానని, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కూడా లేఖ రాశానని గుర్తుచేశారు. తాను ఉన్న వాస్తవాలు మాట్లాడితే కాంగ్రెస్ నేతలు లీకులు అంటూ ఏవేవో మాట్లాడుతున్నారని హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కేటీఆర్ ఒక వ్యక్తి కాదు.. ఒక శక్తి..! - హరీష్ రావు



బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తెలంగాణ రాజకీయాల్లో నెలకొన్న పరిస్థితులపై కౌంటర్ వేశారు. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై జరుగుతున్న విచారణల నేపథ్యంలో ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. లొట్టపీసు కేసులో కేటీఆర్ విచారణకు వెళ్లి వచ్చారు. కానీ, ఇది కేవలం రాజకీయ కక్షనే అని అన్నారు. ఇప్పటి వరకు రేవంత్ రెడ్డి 14 నెలల కాలంలో కేటీఆర్‌పై 14 కేసులు పెట్టారు. ఇవన్నీ అటెన్షన్ డైవర్షన్ కోసం జరుగుతున్నాయని ఆరోపించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో చిల్లర రాజకీయాలు జరుగుతున్నాయని, ఏ చిన్న విషయం జరిగినా కేసులు పెడుతూ ప్రతాపం చూపిస్తున్నారని ఆరోపించారు. దగ్గినా.. తుమ్మినా.. కేసులు పెడుతున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మచ్చ అని విమర్శించారు. ఇక కేటీఆర్ సామర్థ్యాన్ని వివరిస్తూ.. "కేటీఆర్ ఒక వ్యక్తి కాదు, ఒక శక్తి" అని అన్నారు. ఆయనను ముట్టుకుంటే బస్మం అయిపోతారు. ప్రజల్లో ఆయనకు ఉన్న ఆదరణ, నాయకత్వ గుణాలు, కృషి ఏ రాజకీయ కుట్రలకైనా సమాధానం అవుతాయని పేర్కొన్నారు.

## రైతును రాజుగా.. వ్యవసాయాన్ని పండగ చేస్తున్నాం

ఒక కోటి నలభై తొమ్మిది లక్షల ఎకరాలకు చెందిన 70,11,984 మందికి రైతు భరోసా 9 రోజుల్లో అందిస్తాం అన్నారు. రైతుల కోసం ఇప్పటి వరకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేశామని, రాష్ట్రంలో ఒక్కో వ్యవస్థను సరిదిద్దుతున్నామని తెలిపారు. దేశంలో మొట్ట మొదటిసారిగా పేదలకు సన్నబియ్యం ఇస్తున్నామని అన్నారు. గత పాలకులు సర్పంచులకు చెల్లించాల్సిన రూ.1 లక్ష కోట్లు, కాంట్రాక్టర్లకు రూ.60 వేల కోట్లు, ఉచిత కరెంటు పేరుతో

మొదటి పేజీ తరువాయి

అప్పులు.. ఇలా అందినకాడల్లా అప్పులు చేసి మొత్తంగా రూ.8 లక్షలకు పైగా అప్పులు తమ నెత్తిన పడేసి పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హెచ్‌ఏఎంఎల్‌కు రూ.125 కోట్లు విడుదల.. ఉత్తర్వులు జారీ



పాతబస్తీలో మెట్రో రైలు విస్తరణ పనులకుగాను రాష్ట్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్ కేటాయింపులో భాగంగా హైదరాబాద్ ఏయిర్ పోర్ట్ మెట్రోరైలు లిమిటెడ్(హెచ్ఏఎంఎల్)కు రూ.125 కోట్లు విడుదల చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి కె.ఇలంబర్తి ఉత్తర్వులు జారీ చేశారు. బడ్జెట్‌లో పాతబస్తీలో మెట్రోరైలు విస్తరణకు రూ.500 కోట్లు కేటాయించారు. అందులో భాగంగానే రూ.125 కోట్లు విడుదల చేశారు. మరో రూ.375 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఈ రూ.125కోట్లను హెచ్ఏఎంఎల్ పీడీ అకౌంట్‌లో జమచేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతోపాటు వేములవాడ టెంపుల్ ఏరియా డవలప్ మెంట్ ఆథారిటీ(వీటీఏడీఏ)కు రూ.25 కోట్లు చేశారు. బడ్జెట్ లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ రూ.100 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే రూ.25కోట్లు పీడీ అకౌంట్‌లో జమ చేశారు. మరో రూ.75 కోట్లు విడుదల చేయాల్సి ఉంది.

## కక్షతోనే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై కేసులు: మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి



'కాళేశ్వరం ప్రాజెక్టు రైతాంగానికి మేలు చేసే ప్రాజెక్టు. అలాంటి ప్రాజెక్టుపైనే విచారణ పేరిట కేసీఆర్, హరీశ్‌రావును పిలిచారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్‌తో రాష్ట్రానికి మంచి పేరు వచ్చింది. కావాలనే కాంగ్రెస్ ప్రభుత్వం కక్షతోనే కే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నది' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. తమ నేతలపై ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సఫలం కావు అన్నారు. ప్రచారం గ్యారెంటీ కార్డు చూపిస్తూ ఓట్లు వేసుకొని మోసం చేసిన కాంగ్రెస్ నాయకులపై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.

కేటీఆర్ మీద అరవడం కాదని.. మిస్ ఇంగ్లాండ్‌పై కాంగ్రెస్ నాయకులు చేసిన చిలిపి చేష్టలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళలకు ఉచిత బస్ ఒక్కటే చేశారని.. అదే మహిళలకు రూ.2,500 వేయలేదు. 4000 వేలు ఫించన్లు ఇయ్యలేదని నిలదీశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కావాలనే కక్షతో కేటీఆర్‌పై కేసులు పెట్టిన విచారణ పేరుతో వేధిస్తున్నారన్నారు. అందాల పోటీల పేరుతో డబ్బులు వృథా చేశారని ఆరోపించారు. చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

## -విద్యార్థుల రాజకీయ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నివాసం ముట్టడి



మోత్కూర్ ,16 జూన్ (క్రాంతి న్యూస్):నిరుద్యోగులను అడ్డుపెట్టుకొని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న రేవంత్ రెడ్డి ఇప్పుడు అదే నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని, అడిషనల్ పోస్టులు పెంచి ప్రతి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని అలాగే గ్రూప్-1 , గ్రూప్ -2 పోస్టులు భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ పోలీస్ రిక్రూట్మెంట్ చేయాలని అదేవిధంగా అర్హులైన వాళ్లకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు రావడం లేదు ఇది కార్యకర్తల కోసం పెట్టిన పథకమని అలాంటప్పుడు కార్యకర్తల ఓట్లు వేసుకోవాలి ప్రజలను ఎందుకు మోసం చేస్తున్నారని విద్యార్థుల రాజకీయ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఎడ్ల నరేష్ డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మోత్కూర్ మండల అధ్యక్షుడు మల్లెబోయిన మహేష్ అన్నపు హరిబాబు అన్నపు హరిబాబు అనిల్ అఖిల్ ఇతరులు పాల్గొన్నారు.

# గోడలు దూకేందుకు బీజేపీ నేతల యత్నం..




హైదరాబాద్,16 జూన్ ( క్రాంతి న్యూస్ ):నగరంలోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. బల్దియా కార్యాలయం ముందు బీజేపీ ఆందోళనకు దిగింది. నగర సమస్యలపై అధికారులను నిలదీసేందుకు కమలం నేతలు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ ఆఫీస్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. వీధిదీపాలు, రోడ్ల సమస్యతో పాటు డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించాలంటూ బీజేపీ నిరసనకు దిగింది. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. కమిషనర్ ఛాంబర్‌లోకి వెళ్లేందుకు యత్నించిన కార్పొరేటర్లు, బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు

దీంతో పోలీసులకు, బీజేపీ కార్పొరేటర్లకు మధ్య వాగ్వాదం చెలరేగింది. రామ్‌నగర్ కార్పోరేటర్లు గోడలు దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు , బీజేపీ నేతలకు మధ్య తోపులాట జరిగింది. జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసేందుకు వచ్చిన బీజేపీ కార్పొరేటర్లను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో జీహెచ్ఎంసీ ఆఫీస్ గేట్ ముందు కూర్చుని బీజేపీ నేతలు ఆందోళన చేస్తున్నారు. హైదరాబాద్‌లో వీధి దీపాలు, రోడ్లు సరిగా లేకపోవడం, నాలాల పూడిక తీయకపోవడం వంటి అనేక సమస్యలు నగర వాసులను వెంటాడుతున్నాయని, తక్షణమే ఆ సమస్యలను పరిష్కరించాలంటూ పెద్ద ఎత్తున బీజేపీ నేతలు జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు నిరసనకు దిగారు.

ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను చెప్పేందుకు వస్తే గేట్లు మూసేసి రాకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు. విశ్వనగరంగా చెబుతున్న హైదరాబాద్ ఇప్పుడు వీధి దీపాలు లేక అంధకారంలో ఉందన్నారు. వీధిదీపాలు లేని కారణంగా గల్లీల్లో, కాలనీల్లో గంజాయికి అడ్డాలుగా మారాయని తెలిపారు. యువత పక్కదారి పడుతోందని, మద్యం సేవించి మహిళలను ఇబ్బందిపెట్టే పరిస్థితి ఉందన్నారు. హైదరాబాద్‌లోనే ఇలా ఉంటే తెలంగాణ వ్యాప్తంగా పరిస్థితి ఎలా ఉందో అంటూ ఆ పార్టీ నేతలు నిలదీశారు. తప్పకుండా బల్దియా కమిషనర్‌ను కలుస్తామని.. తమను లోపలికి పంపించకపోతే కమిషనర్ బయటకు వచ్చే వరకు ఇక్కడే ఉండి ఆందోళన చేస్తామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు.

# రెవెన్యూ సదస్సుల ద్వారా భూముల సమస్యలు పరిష్కరించుకోవాలి



మోత్కూర్ ,16 జూన్ (క్రాంతి న్యూస్):భూ భారతి పేరుతో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని పెండింగ్ లో ఉన్న భూముల సమస్యలను పరిష్కరించుకోవాలని మోత్కుర్ తహసీల్దార్ జ్యోతి అన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలంలోని పాలడుగు గ్రామంలో సోమవారం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతుల నుంచి వారికి ఉన్న భూ సమస్యలపై ధరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ జ్యోతి మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో చాలా కాలంగా రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రకాల భూముల సమస్యల పరిష్కారానికి భూ భారతి కార్యక్రమంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతాయని ఈ సదస్సులను వినియోగించుకుంటూ సంబంధిత అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకుని బాధితుల భూములకు సర్వహక్కులు పొందేందుకు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో డిటి ఉపేందర్. ఆర్ ఐ సుమన్. రికార్డు అసిస్టెంట్ చరణ్ రాజ్ రైతులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా చిక్కిన డీఈఓ, జూనియర్ అసిస్టెంట్..!




ములుగు ,16 జూన్ ( క్రాంతి న్యూస్ ):ములుగు జిల్లాలో అవినీతి నిరోధక శాఖ చేసిన మేజర్ ఆపరేషన్ చేసిన సంగతి వెలుగులోకి వచ్చింది. ములుగు జిల్లా డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కన్నాయిగూడెం మండలం, లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఓ ఉద్యోగి జాయినింగ్ ఆర్డర్ కోసం డీఈఓ కార్యాలయంలో 20 వేల రూపాయలు లంచంగా డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ముందస్తు సమాచారం మేరకు ఏసీబీ అధికారులు రైడ్ నిర్వహించారు.

ఈ సమయంలో డీఈఓ పాణిని, జూనియర్ అసిస్టెంట్ దిలీప్ లు బాధితుడి నుండి 20 వేల రూపాయల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. దీనితో ఏసీబీ అధికారులు ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ప్రస్తుతం ములుగు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. డీఈఓ కార్యాలయంలో లంచం వంటి వ్యవహారాలు వెలుగులోకి రావడం స్థానికంగా కలకలం రేపింది

# తీరనున్న రాజన్న భక్తుల కల.. రోడ్ల వెడల్పు షురూ..



వేములవాడ ,16 జూన్ ( క్రాంతి న్యూస్ ): దశాబ్దకాలంగా వాయిదా పడుతూ వచ్చిన వేములవాడ పట్టణంలోని రోడ్ వెడల్పు పనులకు ఆదివారం అధికారులు ప్రారంభసూచి ఇచ్చారు. మటన్ మార్కెట్ ప్రాంతంలో ఉన్న మున్సిపల్ దుకాణాలను అధికారుల పర్యవేక్షణలో జేసీబీలతో కూల్చివేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి చర్యలు చేపట్టారు. తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజన్న ఆలయం వరకు రోడ్డును 80 అడుగుల వెడల్పుతో విస్తరించనున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం రూ.47 కోట్లు మంజూరు చేసింది. మొత్తం 260 నిర్వాసితులలో ఇప్పటికే సుమారు 70 మందికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెక్కులు అందజేశారు.బాధితులకు ఇళ్లను ఖాళీ చేయాలన్న నోటీసులు 15 రోజుల క్రితమే జారీ చేయగా, కొంతమంది కోర్టు శరణు పొందారు. మిగతా ఇళ్లు త్వరలోనే కూల్చనున్నారు. మొత్తం 322 స్ట్రక్చర్స్ ఉండగా, నిర్వాసితులందరూ సహకరించాలని వేములవాడ ఆర్డీఓ రాధాబాయి విజ్ఞప్తి చేశారు. రోడ్ వెడల్పు జరుగుతున్న ప్రదేశం పరిధిలో భద్రతా దృష్ట్యా సోమవారం ఉదయం 6 గంటల నుంచి 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్‌ను అధికారులు అమలు చేశారు. ఈ రోడ్ వెడల్పుతో వేములవాడ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలపై పలు సంవత్సరాలుగా ఉన్న అసౌకర్యాలు తొలగిపోవనున్నాయి.

# కర్రలు, కత్తులతో అటవీశాఖ అధికారులపై తిరగబడ్డ ఆదివాసులు



ములుగు ,16 జూన్ ( క్రాంతి న్యూస్ ):ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం రొయ్యూరు సమీపంలోని అడవిలో ఆదివాసులు వేసుకున్న గుడిసెలను కూల్చివేసినందుకు వచ్చిన అటవీశాఖ అధికారులపై కత్తులు, కర్రలతో ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తిరగబడ్డారు. గుడిసెలను అధికారులు తీసుక వచ్చిన జెసిబి, ట్రాక్టర్లను వెనక్కి పంపించారు. అటవీ శాఖ అధికారుల తీరుపై ఆదివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రొయ్యూరు గ్రామానికి చెందిన కొంతమంది ఆదివాసులు సమీపంలోని పోడు భూమిలో గత ఏడాది గుడిసెలు వేసుకున్నారు. తరచూ అటవీ శాఖ అధికారులు ఇబ్బంది పెడుతున్నప్పటికి తమకు నివాసానికి గుడిసెలు వేసుకున్నామని చెప్పుకుంటూ వచ్చారు.

కాగా, సోమవారం ఉదయం సుమారు 60 నుంచి 80 మంది అటవీశాఖ అధికారులు, ఉద్యోగులు, 20 మంది పోలీసుల సహాయంతో అక్కడికి వెళ్లి గుడిసెలను తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో ఆదివాసులు అటవీశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసి గుడిసెల కూల్చివేతను అడ్డుకున్నారు. జెసిబికి అడ్డుపడ్డారు. కర్రలు, కత్తులతో తిరగబడ్డారు. గుడిసెల కూల్చివేత పాల్పడితే తాము ఆత్మహత్య చేసుకుంటామంటూ ఒకరు పెట్రోల్ మీద పోసుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఉద్యోగిపై పెట్రోల్ పడింది. సుమారు రెండు గంటల పాటు అటవీ శాఖ అధికారులు, ఆదివాసీల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. విధి లేని పరిస్థితిలో అటవీ శాఖ అధికారులు వెనుదిరిగారు.

ఛత్తీస్‌గఢ్ నుంచి ఇక్కడికి వచ్చి అడవిని పోడు చేసుకుంటూ నివాసాలు ఏర్పాటు చేసుకుంటే పట్టించుకోని అటవీశాఖ అధికారులు తాము ఉండేందుకు గుడిసెలు వేసుకుంటే ఇబ్బంది పెడుతున్నారంటూ ఆదివాసులు గొల్లుమంటున్నారు. అటవీశాఖ అధికారుల తీరుపై ఉన్నతాధికారులు స్పందించారని తమకు రక్షణ కల్పించాలని గుడిసెలను కూల్చివేసే ప్రయత్నం చేస్తే తాము ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

# ఖాజాగూడలో 27 ఎకరాల భూమి ఆక్రమణపై నలుగురు ఎమ్మెల్యేల పిల్.. హైకోర్టులో విచారణ



హైదరాబాద్,16 జూన్ ( క్రాంతి న్యూస్ ):శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందంటూ నలుగురు ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, మురళీనాయక్ పిల్ దాఖలు చేశారు. దీనిపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. ఖాజాగూడలోని సర్వే నెంబర్ 119, 122లో ఉన్న 27.18 ఎకరాల భూమిని ఆక్రమించారన్నారు. సర్వే నెంబర్ మార్చి పోరంబోకు భూమిని ఆక్రమించారని చెప్పారు. భూమి విలువ రూ.10 వేల కోట్లు ఉంటుందని తెలిపారు.

రంగారెడ్డి కలెక్టర్ 2023లో నిరభ్యంతర పత్రం జారీ చేయడంతో జీహెచ్ఎంసీ భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చిందని న్యాయవాది పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ స్థలంలో 8 టవర్లు నిర్మిస్తున్నారని.. ఒక్కో దాంట్లో 47 అంతస్తులు ఉన్నాయని వివరించారు. ఇవన్నీ ఖాజాగూడ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని తెలిపారు. మరోవైపు ఓ ప్రేవేటు పాఠశాలకు 150 మీటర్ల పరిధిలోనే రెడీమిక్స్ ప్లాంటు ఏర్పాటు చేశారని చెప్పారు. దీంతో పర్యావరణం కాలుష్యమై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని న్యాయవాది వివరించారు. ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని చిక్కుడు ప్రభాకర్ కోర్టును కోరారు. వాదనలు విన్న న్యాయస్థానం.. ప్రభుత్వం, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి, రంగారెడ్డి కలెక్టర్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, హైడ్రాకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.




# ఎంత అణిచి వేయాలని చూస్తే.. అంత పెద్దగా ఎదుగుతాం!



అమరావతి,16 జూన్ ( క్రాంతి న్యూస్ ):కూటమి ప్రభుత్వ నేతలు అక్రమ కేసులు పెట్టి వైసీపీ కేడర్‌ని వేధించాలని చూస్తున్నారని వైసీపీ పబ్లిసిటీ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ మండిపడ్డారు. కూటమి నేతలు ఎంత అణిచివేయాలని చూస్తే.. తాము అంత పెద్దగా ఎదుగుతామన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి.. సీఎం చంద్రబాబుకు వెన్నులో వనుకు పుడుతోందన్నారు. రైతుల పరామర్శకు మాజీ సీఎం వైఎస్ జగన్ వెళ్లినప్పుడు వేలాదిగా జనం తరలివచ్చారని కాకుమాను రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం అమరావతిలో కాకుమాను రాజశేఖర్ మీడియాతో మాట్లాడారు.

'వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి సీఎం చంద్రబాబుకు వెన్నులో వనుకు పుడుతోంది. అందుకే అక్రమ కేసులు పెట్టి మా కేడర్‌ని వేధించాలని చూస్తున్నారు. పొదిలిలో రైతులపై అక్రమ కేసులు పెట్టారు. రైతుల పరామర్శకు వైఎస్ జగన్ వెళ్లినప్పుడు వేలాదిగా జనం తరలివచ్చారు. హెలిప్యాడ్ నుండి పొగాకు బోర్డు దగ్గరకు వెళ్తుండగా టీడీపీ గూండాలతో దాడి చేయించాలని చూశారు. జగన్ వెళ్తుండగా అసలు టీడీపీ కార్యకర్తలు ఎందుకు వచ్చారు?. ఒక కుట్ర ప్రకారమే రాళ్ల దాడి చేసి కానిస్టేబుల్, వైసీపీ కార్యకర్తలను గాయపరిచారు. అయినప్పటికీ తిరిగి మా వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. రౌడీలు, గూండాలను అరెస్టు చేస్తున్నట్టు అర్ధరాత్రి ఇళ్లకు వెళ్లి అరెస్టులు చేస్తున్నారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మా కేడర్‌ని పరామర్శించటానికి వెళ్తుంటే పోలీసులు అడ్డుకున్నారు. దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డికి నోటీసులు ఇచ్చారు. మమ్మల్ని ఎంత అణిచివేయాలని చూస్తే అంత పెద్దగా ఎదుగుతాం' అని కాకుమాను రాజశేఖర్ అన్నారు.

# అంతర్రాష్ట్ర నేరస్తుడి అరెస్టు.. 50 లక్షల విలువైన బంగారం స్వాధీనం



రాజమహేంద్రవరం, 16 జూన్ ( క్రాంతి న్యూస్ ) : అంతర్రాష్ట్ర పాతనేరస్తుడిని రాజమహేంద్రవరం పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.50 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సౌత్ జోన్ డీఎస్పీ రమేశ్‌బాబు మీడియాకు వెల్లడించారు. గాజువాకకు చెందిన పాత నేరస్తుడు బూల నాగసాయి, అతడి స్నేహితుడు మహమ్మద్ సోను అలీ అహ్మద్‌ఖాన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. నాగసాయిపై రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80 కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుడి వద్ద నుంచి 464 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎనిమిది నెలలపాటు కష్టపడి నాగసాయిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపిన డీఎస్పీ.. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ బాజీలాల్, ఇతర సిబ్బందిని అభినందించారు.

# చిలకలూరిపేట మున్సిపాలిటీలో అక్రమాలపై విచారణ జరపండి: లావు శ్రీకృష్ణదేవరాయలు



నరసరావుపేట,16 జూన్ ( క్రాంతి న్యూస్ ): పల్నాడు జిల్లా చిలకలూరిపేట మున్సిపాలిటీలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని ప్రభుత్వాన్ని తెదేపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు ఆయన లేఖ రాశారు. చిలకలూరిపేట మున్సిపాలిటీ పరిధిలో రూ. 34.34లక్షల కుంభకోణం జరిగినట్లు ఎంపీ ఆరోపించారు. ఇప్పటికే 11 మంది సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. అక్రమాలపై సమగ్ర విచారణ జరిపితే అసలు దోషులెవరో తెలుస్తుందన్నారు.

# ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు విడుదల.. వారికి మాత్రం తప్పనిసరి!



ఏపీ,16 జూన్ ( క్రాంతి న్యూస్ ):ఏపీలో గ్రామ/వార్డ్, సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల అయ్యాయి. గ్రామ/వార్డ్, సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ తర్వాత ప్రభుత్వం బదిలీలు చేస్తోంది. ఒకే చోట ఐదేళ్లు సర్వీస్ పూర్తి చేస్తే.. బదిలీ తప్పనిసరి అని ఉత్తర్వులు జారీ చేసింది. 5 సంవత్సరాలు కాలం పూర్తికాని వారు వ్యక్తిగత అభ్యర్థన మేరకు బదిలీకి అర్హులుగా పేర్కొంది. ఉద్యోగికి తన సొంత మండలంలో పోస్టింగ్ ఇవ్వకూడదని స్పష్టం చేసింది. దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, భార్యా భర్తలు ఒకే చోట పోస్టింగ్‌లకు సంబంధించి ప్రాధాన్యత ఇవ్వనుంది.

ఖాళీల వివరాలు హెచ్‌ఆర్ఎంఎస్ పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. బదిలీ ఉత్తర్వులు జిల్లా కలెక్టర్లు జారీ చేస్తారని పేర్కొంది. బదిలీ యూనిట్ పాత జిల్లాల ఆధారంగా ఉంటుందని పేర్కొంది. మొత్తం బదిలీ ప్రక్రియ ఈ నెల 30లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం కలెక్టర్లకు సూచించింది. 5 సంవత్సరాలు పూర్తికాని ఉద్యోగులకై ఆన్‌లైన్ ద్వారా బదిలీ అభ్యర్థన ఇచ్చే సదుపాయంను కల్పించింది. దృష్టిహీనులైన వారు స్వచ్ఛందంగా కోరితే మాత్రమే బదిలీ ఉంటుంది. మానసికంగా వెనుకబడి ఉన్న పిల్లల తల్లిదండ్రులు, గిరిజన ప్రాంతాల్లో రెండు ఏళ్లకు పైగా పనిచేసిన వారు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యంతో ఉన్నవారు, దీర్ఘకాలిక అనారోగ్య కారణాలతో బదిలీ కోరినవారు, కంటుబడిన ఉద్యోగినులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది.

భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే ఒకే ప్రాంతంలో పోస్టింగ్‌కి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం కలెక్టర్లకు సూచించింది. ఐటీడీఏ మరియు వెనుకబడిన ప్రాంతాల్లో ముందుగా ఖాళీలు పూర్తి చేయాలని ఆదేశించింది. ఐటీడీఏ ప్రాంతాల్లో బదిలీ అయిన వారిని ప్రత్యామ్నాయ ఉద్యోగి జాయిన్ చేసిన తరువాతే రిలీవ్ చేయాలన్న నిబంధన పెట్టింది. బదిలీ అయిన వారు సూచించిన స్థలానికి చేరుకోకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని హెచ్చరించింది. బకాయి చెల్లింపులు చెల్లించకుండా ఏ ఉద్యోగినీ ఉద్యోగినీ రిలీవ్ చేయకూడదు. హెచ్‌ఆర్ఎంఎస్ పోర్టల్‌లో అన్ని ఉద్యోగుల వివరాలను జులై 10లోపు అప్‌డేట్ చేయాలని పేర్కొంది.

# కొండపల్లి మున్సిపాలిటీ టీడీపీ కైవసం



ఎన్టీఆర్ జిల్లా,16 జూన్ ( క్రాంతి న్యూస్ ):ఎన్టీఆర్ జిల్లాలో మరో మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకుంది. కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను తెలుగుదేశం పార్టీ దక్కించుకుంది. చైర్మన్‌గా టీడీపీకి చెందిన చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్‌గా చుట్టుకుదురు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అలాగే వైస్ చైర్‌పర్సన్‌గా ఇండిపెండెంట్ అభ్యర్థి కరిమికొండ శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. అయితే కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నికల ఫలితంపై తీవ్ర ఉత్కంఠం నెలకొంది. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దగ్గరుండి మరీ అక్కడి పరిస్థితులను పర్యవేక్షించారు.

హైకోర్టు ఆదేశాల మేరకు సీల్డ్ కవర్లో తీర్పు ఫలితం అధికారుల వద్దకు వచ్చింది. ఈ క్రమంలో భారీ బందోబస్తు మధ్య సీల్డ్ కవర్‌ను తెరిచి.. ఫలితాలను ప్రకటించారు అధికారులు. కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను టీడీపీ దక్కించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. కొండపల్లి మున్సిపల్ చైర్మన్‌గా చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్ పర్సన్‌లుగా కరిమికొండ శ్రీలక్ష్మి, చుట్టుకుదురు శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

కొండపల్లి మున్సిపాలిటీకి మొత్తం 29 వార్డులు ఉన్నాయి. ఇందులో 14 టీడీపీ, 14 వైసీపీ సరి సమానంగా కైవసం చేసుకున్నాయి. అలాగే ఒక ఇండిపెండెంట్ గెలుపొందారు. ఈ క్రమంలో ఇండిపెండెంట్ అభ్యర్థి టీడీపీకి మద్దతు ఇవ్వడం తెలుగుదేశం పార్టీ సీట్లు 15కు చేరాయి. దీంతో కొండపల్లి మున్సిపాలిటీ టీడీపీ సొంతమైంది. మరోవైపు 14 మంది వైసీపీ కౌన్సిలర్లకు గాను కేవలం 8 మంది సభ్యులు మాత్రమే హాజరవగా.. మిగిలిన వారు గైర్హాజరయ్యారు

# చేపల వేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులు మృతి



కృష్ణా జిల్లా,16 జూన్ ( క్రాంతి న్యూస్ ):రాష్ట్రంలో విషాద ఘటన చోటుచేసుకుంది. చేపల వేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులు మృతి చెందారు. డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలోని సాగర సంగమం వద్ద చేపల వేటకు వెళ్తున్న ఇద్దరు మత్స్యకారులు బోటులో నుంచి జారిపడి మృతి చెందారు. కృష్ణా జిల్లా నాగాయలంక నుంచి చేపల వేటకు మత్స్యకారులు ఇక్కడికి వచ్చారు. వారు అంతర్వేది తీరానికి చేరుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

ఈ విషాద ఘటన పై ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. ఈ క్రమంలో కృష్ణా జిల్లా నాగాయలంక నుంచి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు బోటు నుంచి జారి పడి మృతి చెందడం పట్ల మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలు మత్స్య శాఖ కమిషనర్ తో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబానికి తక్షణమే ఆదుకోవాలని కమిషనర్ కు ఆదేశించారు. గాయాలైన ఒకరికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు చేపల వేటకు వెళుతున్న మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# షార్‌లో తీవ్రవాదులు ఉన్నారంటూ ఫోన్



నెల్లూరు, జూన్ 16: జిల్లాలోని షార్‌లో తీవ్రవాదులు ఉన్నారంటూ గత అర్ధరాత్రి దాటాక చెన్నై కమాండ్ కంట్రోల్‌కు ఫోన్ కాల్స్ వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన నెల్లూరు జిల్లా పోలీస్ యంత్రాంగం శ్రీహరి కోటలో సోమవారం తెల్లవారుజాము నుంచి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ బలగాలు టీంలుగా ఏర్పడి షార్ చుట్టుపక్కల కూంబింగ్ నిర్వహిస్తున్నారు. సముద్ర మార్గాల్లో కూడా కోస్టల్ గార్డ్స్ తనిఖీలు చేశారు. షార్ మొదటి గేటు, షార్ ఉద్యోగుల కాలనీలో నాయుడుపేట డీఎస్పీ చెంచు బాబు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

షార్‌లో బాంబులు పెట్టారు, తీవ్రవాదులు ఉన్నారంటూ చెన్నై కమాండ్ కంట్రోల్ రూంకు గుర్తుతెలియని వ్యక్తులు కాల్ చేశారు. అయితే ఇది ఆకతాయిల పనా, లేకపోతే నిజంగానే ఉందా అనేది అర్థంకాని పరిస్థితి. దీంతో బలగాలు అప్రమత్తమై షార్‌లో అణువణువునా గాలిస్తున్నారు. షార్ చుట్టూ నీరు ఉంటుంది. షార్‌లోకి వెళ్లేందుకు కేవలం ఒక మార్గం మాత్రమే ఉంది. షార్‌లో రెండు వేల మంది వరకు సీఐఎస్ఎఫ్ జవాన్లు ఉంటారు. వారంతా కూడా అడవులను జల్లెడపడుతున్నారు.

ప్రపంచ స్థాయిలో అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ ఎంతో వేగంగా దూసుకెళు న్న విషయం తెలిసిందే. ఇలాంటి సమయంలో ఏదైనా ప్రమాదం జరుగుతుందా అని భావిస్తూ పెద్ద ఎత్తున సీఐఎస్ఎఫ్ జవాన్లు అడవుల్లో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. కంట్రోల్ రూంలు, అక్కడ ఉండే పలు కాలనీలను కూడా తనిఖీలు చేస్తున్నారు.

మరోవైపు సముద్రమార్గం ద్వారా ఎవరైనా చొరబడ్డారా అనే అనుమానంతో అక్కడ కూడా ప్రత్యేకమైన బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. తీవ్రవాదులు ఉన్నారనే కాల్ రావడంతో షార్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిజంగా తీవ్రవాదులు చొరబడ్డారా లేదా అనే దానిపై విస్తృతంగా సోదాలు జరుగుతున్నాయి. భద్రతా బలగాలు ఎవరినీ కూడా లోపలికి పంపించకుండా మెయిన్ గేటు వద్దే క్షుణ్ణంగా సోదాలు చేస్తున్నారు. ఈరోజు మధ్యాహ్నానికి దీనిపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే షార్‌లోకి తీవ్రవాదులు చొరబడే అవకాశాలు లేవు.

షార్ చుట్టూ కూడా మత్స్యకారుల గ్రామాలు, దీవులు ఉన్నాయి. ఈ గ్రామ ప్రజలు చేపల వేటతో జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు వస్తే వెంటనే షార్‌లోని సీఐఎస్ఎఫ్ జవాన్లు, స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తుంటారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో ఎవరైనా తెలియని వ్యక్తులు వచ్చారా అనేదానిపై మత్స్యకార ప్రజలను కూడా పోలీసులు అడిగి తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో షార్ చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేశారు.

# ఓ ప్రముఖ క్రికెటర్ నన్ను రిటైర్ అవమన్నాడు: కరుణ్ నాయర్



ఇంటర్నెట్ డెస్క్,16 జూన్ ( క్రాంతి న్యూస్ ): దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత టీమ్ఇండియా టెస్ట్ జట్టులోకి కరుణ్ నాయర్ పునరాగమనం చేశాడు. ఈనేపథ్యంలో రెండేళ్ల క్రితం జరిగిన ఓ సంఘటనను తాజాగా ఇంటర్వ్యూలో పంచుకున్నాడు. ఓ ప్రముఖ క్రికెటర్ తనను అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అవమని సూచించాడని చెప్పాడు. ఆర్థికంగా భరోసానిచ్చే ఫ్రాంఛైజీ టీ20 లీగ్‌లు ఆడుకోమని సలహా ఇచ్చాడని వివరించాడు. కానీ కరుణ్ నాయర్ మాత్రం పట్టువదలని విక్రమార్కుడిలా దేశవాళీల్లో రాణించి, తిరిగి జాతీయజట్టులోకి పునరాగమనం చేశాడు. జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌తో జరగనున్న అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌కు భారత జట్టు తరపున ఎంపికయ్యాడు. టీమ్ఇండియా ప్రకటించిన 18 మంది సభ్యులతో కూడిన బృందంలో స్థానం సంపాదించుకున్నాడు.

'నాకు ఇప్పటికీ గుర్తుంది. ఓ ప్రముఖ భారత క్రికెటర్ రెండేళ్ల క్రితం నాకు ఫోన్ చేశాడు. నన్ను అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకోమన్నాడు. ఆర్థికంగా భరోసా కోసం విదేశీ టీ20 లీగుల్లో ఆడమని సూచించాడు. అతడు చెప్పినట్లు చేయడం సులువే. కానీ నా లక్ష్యం తిరిగి భారత జట్టుకు ఆడటమే. ఈ సంఘటన రెండేళ్ల క్రితం జరిగింది. కానీ ఇప్పుడు నేను తిరిగి టీమ్ ఇండియాలో చోటు దక్కించుకున్నాను' అని ఆ ఇంటర్వ్యూలో కరుణ్ నాయర్ అన్నాడు. అతడు ప్రస్తుతం మంచి ఫామ్‌లో కనిపిస్తున్నాడు. తాజాగా ఇంగ్లండ్ లయన్స్‌తో ఇండియా ఏ జట్టు తలపడిన అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో అతడు అద్భుతంగా బ్యాటింగ్ చేసి డబుల్ సెంచరీ సాధించాడు. ప్రస్తుత భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్ కూడా కరుణ్ నాయర్‌కు మద్దతుగా నిలుస్తున్నాడు. 'మీరు ఎన్ని పరుగులు చేసినా.. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే ఎప్పటికీ వదులుకోని మనస్తత్వం. అదే మిమ్మల్ని తిరిగి జట్టులోకి తీసుకువచ్చింది. ఇది మొత్తం ప్రపంచానికి స్ఫూర్తినిచ్చే విషయం' అని కరుణ్‌నాయర్‌ను ఉద్దేశించి గౌతమ్ గంభీర్ అన్నాడు.

అలాగే కౌంటీ క్రికెట్ ఆడిన అనుభవం ఉన్న కరుణ్.. టీమ్ఇండియాకు ఎంతో మేలు చేస్తాడని గౌతమ్ గంభీర్ తన అభిప్రాయం వ్యక్తంచేశాడు. నాయర్ 2023, 2024 కౌంటీ ఛాంపియన్‌షిప్ సీజన్లలో నార్తాంప్టన్‌షైర్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 10 మ్యాచ్‌ల్లో 736 పరుగులు చేశాడు. ఇందులో చిరస్మరణీయమైన ఓ డబుల్ సెంచరీ కూడా ఉంది. అలాగే 2024-25 రంజీ ట్రోఫీలో విదర్భకు ప్రాతినిధ్యం వహించిన అతడు 16 ఇన్నింగ్స్‌ల్లో 863 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు, రెండు అర్ధ సెంచరీలున్నాయి. విజయ్ హజారే ట్రోఫీలో ఎనిమిది ఇన్నింగ్స్‌లో ఏకంగా 779 పరుగులు చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2024-25లో (టీ20) ఆరు ఇన్నింగ్స్‌ల్లో 255 పరుగులు చేశాడు.


# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ నిర్ధారణ శిబిరం

### శిశు మందిర స్కూలుకి మంచినీటి ట్యాంకున అందజేశారు




పాల్వంచ ,16 జూన్ (క్రాంతి న్యూస్ ): పాల్వంచ ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ వారి ఆదేశంతో డాన్ టు డస్క్ అంటే సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు సమాజ సేవా కార్యక్రమాలు చేసే కార్యక్రమాన్ని డాన్ టు డస్క్ అంటారు ఈ కార్యక్రమంలో భాగంగా నిరుపేదలైన పేషెంట్లకు షుగర్ టెస్టులు విజయ కేర్ హాస్పిటల్ డాక్టర్స్ గోపి నందన్ అనూష లక్ష్మి వారి సహకారంతో నిర్వహించడం జరిగింది, అనంతరం శిశు మందిర్ స్కూల్ కి ఒక నీటి ట్యాంకు, మరియు ఆ స్కూల్లో చదువుతున్న విద్యార్థులు కు నోట్ బుక్స్ ను పంపిణీ చేశారు, ఐదుగురికి నిత్యవసర సరుకులు, మరియు బియ్యం, వాసవి క్లబ్ నాయకులు చుండూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఐదు కిట్ లు ఇవ్వడం జరిగింది, ఒక రైతుకు సన్మానం చేసి ఒక బేషన్ మరియు పార ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బండారు వెంకటేశ్వరరావు, ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, రేపాక రాజ మనోహర్, హాజరయ్యారు చాంబర్ ఆఫ్ కామర్స్ కన్వీనర్ చలవాది ప్రకాష్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ పెండ్యాల రోజులక్ష్మి, ఇంటర్నేషనల్ నాయకులు ధారా నరసింహారావు, మిరియాల నాగశ్రీలత మరియు వాసవి క్లబ్ వనిత వాసవి క్లబ్ ప్రెసిడెంట్, సంక సర్వేష్ సెక్రటరీ, దారా శంకర్, వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ సంక రమ, సెక్రటరీ దారా మాధవి, ట్రెజరర్ దొంతు మౌనిక, వాసవి వనిత క్లబ్ వైస్ ప్రెసిడెంట్ వంకధార ఇందిరా, మధు, ఇందిరా, పాల్గొన్నారు

# సెర్ప్‌కు 25 ఏళ్లు.. సీఎం చంద్రబాబు ప్రశంసలు




అమరావతి,16 జూన్ ( క్రాంతి న్యూస్ ):గ్రామాల ఆర్థిక అభివృద్ధి కోసం, గ్రామాల్లో పేదరిక నిర్మూలన కోసం తీసుకొచ్చిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ను మహిళలు ఓ ఉద్యమంలా తీసుకెళ్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. తొలుత వెలుగు అనే ఓ కార్యక్రమాన్ని చేపట్టగా.. అది కాలక్రమేనా సెర్ప్‌గా రూపాంతరం చెందిందన్నారు. సెర్ప్‌ను తీసుకొచ్చి నేటికి 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా గ్రామీణ మహిళలకు, సెర్ప్ ఉద్యోగులకు సీఎం అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో ముఖ్యమంత్రి పోస్ట్ చేశారు.

చంద్రబాబు ట్వీట్ ఇదే..

'సరిగ్గా 25 సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు అనే ఒక మారుమూల ప్రాంతంలో వెలుగు అనే ఒక కార్యక్రమాన్ని ప్రారంభించాను. గ్రామీణ ప్రాంత మహిళల భాగస్వామ్యంతో గ్రామాల ఆర్థికాభివృద్ధిని సాధించడమే ఆనాటి ప్రాజెక్టు లక్ష్యం. అది కాలక్రమంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ గా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి లక్షలాది గ్రామీణ మహిళల జీవితాలలో, వేలాది గ్రామాలలో నిరంతరం అభివృద్ధి వెలుగులు నింపుతూ గ్రామీణ పేదరిక నిర్మూలనకు సెర్ప్ నిరంతరం కృషి చేస్తోంది. సెర్ప్ కార్యకలాపాలలో భాగస్వాములవుతూ... నవసమాజ నిర్మాతలై గ్రామీణ పేదరిక నిర్మూలనను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్తున్న గ్రామీణ మహిళలకు... వారిని ప్రగతి పథంలో నడిపిస్తున్న సెర్ప్ ఉద్యోగులకు ఈ సందర్భంగా అభినందనలు' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

# నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై ఉక్కు పాదం మోపాలి

### అధిక వర్షాలు సంభవించినపుడు లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

### నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్



భద్రాద్రి కొత్తగూడెం ,16 జూన్ (క్రాంతి న్యూస్ ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు.పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించి తమ తమ నివాస ప్రాంతాల్లో మరియు వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చేయాలని తెలిపారు.ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు.వర్షాకాలంలో అధిక వర్షాలు సంభవించినపుడు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసే విధంగా ముందస్తుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు.జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి, భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్,భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్,కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి మరియు జిల్లాలోని ఇన్ స్పెక్టర్స్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి హైకోర్టులో చుక్కెదురు




హైదరాబాద్,16 జూన్ ( క్రాంతి న్యూస్ ):భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. కమలాపురం మండలం వంగపల్లిలో గ్రానైట్ వ్యాపారి మనోజ్ క్వారీ నిర్వహిస్తున్నారు. రూ.50 లక్షలు ఇవ్వాలంటూ తమను కౌశిక్‌రెడ్డి బెదిరించారంటూ మనోజ్ భార్య ఉమాదేవి ఫిర్యాదు చేశారు. దీంతో సుబేదారి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలంటూ కౌశిక్‌రెడ్డి ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఆయన పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులిచ్చింది.

# సింగరేణి వ్యాపార విస్తరణలో వేగం పెంచండి - సీఎండీ ఎన్. బలరామ్ హెచ్చరిక



భద్రాద్రి కొత్తగూడెం ,16 జూన్ (క్రాంతి న్యూస్ ): వివిధ రంగాల్లో వ్యాపార విస్తరణకు శ్రీకారం చుట్టిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రాజెక్టుల ప్రగతిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) ఎన్. బలరామ్, ప్రాజెక్టుల పనితీరు మందగించిన విభాగాల అధికారులకు గట్టిగా హెచ్చరించారు. పనులు నిర్దేశిత గడువుల్లో పూర్తికావాల్సిన అవసరం ఉందని, ఆలస్యం జరిగినట్లయితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన సమీక్షా సమావేశంలో, సోలార్ విద్యుత్, పవన విద్యుత్, జియోథర్మల్ విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, కీ ఖనిజాల ఉత్పత్తి, బొగ్గు నుండి కెమికల్స్ తయారీ, కార్బన్ డయాక్సైడ్ నుండి మిథనాల్ ఉత్పత్తి, సర్ఫేస్ మరియు భూగర్భ గ్యాసిఫికేషన్, జాయింట్ వెంచర్లు వంటి 28 వ్యాపార విస్తరణ ప్రాజెక్టులపై సమీక్ష జరిగింది. సీఎండీ శ్రీ బలరామ్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుల వల్ల సింగరేణికి భవిష్యత్తులో విశేష ఆర్థిక లాభాలు లభిస్తాయి. అందుకే పనుల విషయంలో అలసత్వం లేకుండా ప్రతి శాఖ దృష్టి సారించాలి. అన్ని ప్రాజెక్టుల్లో 10 రోజుల్లోనైనా గణనీయమైన పురోగతి కనిపించాలి. ఇకపై ప్రతి వారం వ్యాపార విస్తరణ పనులపై ప్రత్యేక సమీక్ష ఉంటుంది." ప్రభుత్వాల సహకారం: రాష్ట్రం, కేంద్రం ఈ వ్యాపార విస్తరణలకు పూర్తి మద్దతు ఇస్తున్నాయని, ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని సీఎండీ పేర్కొన్నారు. ఇతర కీలకాంశాలు: కార్యాలయాలు, క్వార్టర్లపై రూఫ్‌టాప్ సోలార్ పవర్ ఏర్పాటు కోల్ వాషరీలు, హైడ్రాలిక్ కన్వేయర్లు ఏర్పాటు ప్రణాళికలపై చర్చ ప్రతి శాఖకు బాధ్యతలు అప్పగిస్తూ తదుపరి సమీక్షలో ఫలితాలు చూపాలని సూచించారు ఈ సమావేశంలో డైరెక్టర్ (ఈ అండ్ ఎం): డి. సత్యనారాయణ రావు, డైరెక్టర్ (ఆపరేషన్స్): ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ప్లానింగ్): కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్): గౌతమ్ పొట్రు, ఐఏఎస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్): ఎస్.డి.ఎం సుభాని, ఇతర శాఖల 20 మంది జనరల్ మేనేజర్లు సీపీపీ, మార్కెటింగ్, సోలార్ పవర్, థర్మల్ పవర్, సివిల్, బిజినెస్ డెవలప్‌మెంట్, రీసెర్చ్, డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం ఏరియా డిప్యూటీ జిఎం (పర్సనల్)గా గామలపాటి వెంకట మోహన్ రావు బాధ్యతల స్వీకారం



భద్రాద్రి కొత్తగూడెం ,16 జూన్ (క్రాంతి న్యూస్ ): ఇల్లందు ఏరియాలో డిప్యూటీ జి.ఎం (పర్సనల్)గా విధులు నిర్వహించిన గామలపాటి వెంకట మోహన్ రావు బదిలీపై కొత్తగూడెం ఏరియా డిప్యూటీ జి.ఎం (పర్సనల్)గా సోమవారం న బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, సిబ్బంది, జి.ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. నూతన డిప్యూటీ జి.ఎం (పర్సనల్) మాట్లాడుతూ, "పర్సనల్ విభాగంలో పారదర్శకతతో, సమర్థవంతంగా పనిచేస్తూ, ఉద్యోగుల సమస్యలను కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండానే పరిష్కరించే దిశగా కృషి చేస్తాను" అని తెలిపారు. సహోద్యోగుల సహకారంతో శాఖ పనితీరును మరింత మెరుగుపరిచేందుకు తనవంతు బాధ్యతగా పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ గోవర్ధన హరీష్, సీనియర్ పిఓలు మజ్జి మురళి, మొహమ్మద్ మాథీన్ హుస్సైన్, జి.ఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీలు ఏఐటియూసి యూనియన్ కే. సౌజన్య, ఐఎన్‌టియూసి యూనియన్ సిహెచ్.సాగర్, పర్సనల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ చిన్న చిన్న పనులు చేస్తే

## రాత్రి గురక సమస్య అస్సలు ఉండదు..!

హెల్త్ న్యూస్ ,16 జూన్ ( క్రాంతి న్యూస్ ): పడుకునేటప్పుడు వీలైతే పక్కకు తిరిగి పడుకోండి. ఎడమ లేదా కుడి భుజంపై పడుకోవడం వల్ల గొంతు మార్గం ఖాళీగా ఉంటుంది. గాలి సులభంగా లోపలికి బయటకు వెళ్తుంది. ఇది గుర్రు తగ్గించే సహజమైన పద్ధతుల్లో ఒకటి. ఎక్కువ బరువు ఉన్నవారికి శ్వాస మార్గాల చుట్టూ కొవ్వు పేరుకుపోయే అవకాశం ఉంటుంది. ఇది గాలి ప్రవాహాన్ని అడ్డుకుని గుర్రుకు దారి తీస్తుంది. అందుకే ఆరోగ్యంగా బరువును నియంత్రించుకోవడం చాలా అవసరం.



శరీరంపై చెడు ప్రభావం చూపే అలవాట్లలో మద్యం తాగడం, పొగతాగడం ముఖ్యమైనవి. ఇవి గొంతు భాగాన్ని సడలించి, శ్వాసకు ఆటంకం కలిగిస్తాయి. ముఖ్యంగా నిద్రకు ముందు మద్యం తాగడం వల్ల గుర్రు పెరుగుతుంది. వీటిని పూర్తిగా మానేసే ప్రయత్నం చేయాలి.

రోజంతా తగినంత నీళ్లు తాగకపోతే శ్వాస మార్గాలు పొడిగా మారి గాలిని అడ్డుకుంటాయి. ఇది కూడా గుర్రుకు ప్రధాన కారణం. అందుకే రోజూ కనీసం 2.5 లీటర్ల వరకు నీటిని తాగాలి. నిద్రకు ముందు ఒక కప్పు వేడి టీ లేదా తులసి టీ తాగితే మరింత మేలు.

నిద్రపోయే ముందు భారీ భోజనం చేయడం వల్ల జీర్ణవ్యవస్థపై ఒత్తిడి పెరుగుతుంది. ఇది శ్వాసపై ప్రభావం చూపుతుంది. అందువల్ల రాత్రి భోజనం పడుకునే కనీసం రెండు గంటల ముందు ముగించడం ఉత్తమం.

ప్రతి రోజు ఒకే సమయంలో నిద్రపోవడం, ఒకే సమయంలో లేవడం శరీరంలో సరైన నిద్ర అలవాటును పెంచుతుంది. అలాగే ప్రతిరోజూ కొన్ని నిమిషాలు యోగా, ధ్యానం చేయడం ద్వారా మానసిక ఉల్లాసం పెరిగి శరీరం విశ్రాంతి తీసుకుంటుంది. ఇది గుర్రు తగ్గించడంలో సహాయపడుతుంది.

ఈ సులభమైన చిట్కాలను పాటించడం వల్ల గుర్రు సమస్య తగ్గిపోతుంది. అయితే మీరు ఏ మార్పులను చేసినా గుర్రు సమస్య కొనసాగితే నిపుణుడిని సంప్రదించడం ఉత్తమం. ఎందుకంటే దీని వెనుక ఇతర ఆరోగ్య సమస్యలు ఉండే అవకాశం ఉంది.

# మీ ఒంట్లో ఆ సమస్య ఉంటేనే నోటి పూతలు వస్తాయట..

హెల్త్ న్యూస్ ,16 జూన్ ( క్రాంతి న్యూస్ ): వేసవిలో తరచుగా నోటి పూతల గురించి ఫిర్యాదు ఉంటుంది. కడుపు సమస్యల వల్ల నోటి పూతలు వస్తాయని వైద్యులు అంటున్నారు. జీర్ణవ్యవస్థలో సమస్యలు లేదా అధిక ఆమ్లత్వం వల్ల కూడా నోటి పూతలు వస్తాయి. నోటి పూతలకు ప్రధాన కారణాలు ఏమిటి.. వాటిని ఇంటి నివారణలతో ఎలా నయం చేయవచ్చు. దీని గురించి నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకోండి.. నోటి పూతల సమస్య తరచుగా ప్రజలకు ఉంటుంది. ఈ సమస్య తినడంలో అజాగ్రత్త కారణంగా వస్తుంది. కడుపులో సమస్య ఉన్నప్పుడు నోటి పూతలు వస్తాయి. ఈ పూతల బుగ్గ, పెదవులు, నాలుక లేదా గొంతు లోపలి చర్మంపై కూడా సంభవించవచ్చు.. నోటి పూతలు నొప్పిని కలిగిస్తాయి.. దీంతో ఆహారం తినడం, నీళ్లు తాగడం కష్టంగా మారుతుంది. ఆయుర్వేదం ప్రకారం, జీర్ణవ్యవస్థలో సమస్య ఉన్నప్పుడు, కడుపులో వేడి ఉంటుంది.. దీని కారణంగా నోటి పూతలు వస్తాయి.

డుపులో వేడి వల్ల నోటి పూతలు..

ఘజియాబాద్‌లోని ఆయుర్వేద విభాగానికి చెందిన డాక్టర్ అమిత్ ముద్గల్ వివరిస్తూ.. కడుపులో వేడి కారణంగా, తరచుగా నోటిలో పుండ్లు వస్తాయి. ఈ పుండ్లు నొప్పిని కలిగిస్తాయి, దీని కారణంగా తినడానికి.. మాట్లాడటానికి ఇబ్బంది కలిగిస్తాయి. కొన్నిసార్లు ఈ పుండ్లు నాలుకపై సంభవిస్తాయి. నాలుకపై చాలా చిన్న పుండ్లు కనిపిస్తాయి. గొంతులోని పుండ్లు అత్యంత ఇబ్బందికరమైనవి. కడుపులో ఎక్కువ ఆమ్లం ఏర్పడినప్పుడు.. అది తిరిగి నోటిలోకి వచ్చి పూతలకు కారణమవుతుంది. కడుపులో వేడితో పాటు, విటమిన్ లోపం, ఒత్తిడి, ఇన్ఫెక్షన్, ఇతర ఆరోగ్య సమస్యలు కూడా నోటి పూతలకు కారణమవుతాయి. నోటి పూతలను నయం చేయడానికి కొన్ని ఇంటి నివారణలు ఉన్నాయి.



నోటి పూతలు - బొబ్బలను ఈ పద్ధతుల ద్వారా నయం చేయవచ్చు..

డాక్టర్ అమిత్ ప్రకారం.. నోటి పూతల విషయంలో, పటిక నీటితో పుక్కిలించాలి. ఇది పూతల నుండి త్వరగా ఉపశమనం ఇస్తుంది. దీనితో పాటు, గమ్ తిరా కడుపులోని వేడిని తగ్గించడంలో కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. నోటి పూతల విషయంలో, మీరు పెరుగు, తేనె, పసుపు, త్రిఫల, తులసి ఆకులు, ఏలకులు, సోంపు, చక్కెర సిరప్, కొత్తిమీర, లికోరైస్ కూడా ఉపయోగించవచ్చు. ఇవి నోటి పూతల నుండి త్వరగా ఉపశమనం ఇస్తాయి. ఈ పదార్థాలు కడుపులోని వేడిని కూడా శాంతపరుస్తాయి.

# థైరాయిడ్ ఉన్నవారికి వరం.. ఈ నట్స్.. విడిచిపెట్టకుండా తినాల్సిందే..!

హెల్త్ న్యూస్ ,16 జూన్ ( క్రాంతి న్యూస్ ): మనకు తినేందుకు ఎన్నో రకాల నట్స్ అందుబాటులో ఉన్నాయి. గింజల పేరు చెప్పగానే చాలా మంది వాల్ నట్స్, బాదం, జీడిపప్పు, పిస్తాలను నట్స్‌గా భావిస్తుంటారు. అయితే కేవలం ఇవే కాదు, నట్స్‌లో ఇంకా చాలా వెరైటీలు ఉన్నాయి. వాటిల్లో బ్రెజిల్ నట్స్ కూడా ఒకటి. ఇవి ఇతర నట్స్‌తో పోలిస్తే సైజులో కాస్త పెద్దవిగా ఉంటాయి. కనుక ఈ నట్స్‌ను రోజుకు 3 తిన్నా చాలు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. బ్రెజిల్ నట్స్ మనకు ప్రస్తుతం అంతటా లభిస్తున్నాయి. పేరుగాంచిన మెడికల్ షాపులతోపాటు సూపర్ మార్కెట్లలోనూ మనకు బ్రెజిల్ నట్స్ అందుబాటులో ఉన్నాయి. వీటిని రాత్రి పూట నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం బ్రేక్ ఫాస్ట్‌లో భాగంగా ఈ నట్స్‌ను తినాలి. ఇలా రోజూ తింటుంటే అనేక లాభాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు.



**థైరాయిడ్ సమస్య తగ్గేందుకు..**

బ్రెజిల్ నట్స్ లో సెలీనియం అధికంగా ఉంటుంది. వీటిని రోజూ తింటే మనకు రోజుకు కావల్సిన దాని కన్నా అధిక మొత్తంలోనే సెలీనియం మనకు లభిస్తుంది. సెలీనియం వల్ల పలు జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడతాయి. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. దీని వల్ల థైరాయిడ్ గ్రంథి పనితీరు మెరుగు పడుతుంది. థైరాయిడ్ సమస్య ఉన్నవారు లేదా థైరాయిడ్ ట్యాబ్లెట్లను రోజూ వాడుతున్నవారు బ్రెజిల్ నట్స్‌ను రోజూ తింటుంటే థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పనిచేస్తుంది. దీంతో జీవక్రియలు సరిగ్గా నిర్వహించబడతాయి. మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. థైరాయిడ్ ఉన్నవారికి బ్రెజిల్ నట్స్‌ను వరంగా చెబుతారు.

**రోగ నిరోధక వ్యవస్థకు..**

బ్రెజిల్ నట్స్‌లో విటమిన్ ఇ, ఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి కూడా యాంటీ ఆక్సిడెంట్ల మాదిరిగానే పనిచేస్తాయి. ఇవి పలు ఎంజైమ్‌లను ఉత్పత్తి చేసేందుకు సహాయం చేస్తాయి. వీటి వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గుతాయి. గుండె వాపులకు గురి కాకుండా సురక్షితంగా ఉంటుంది. దీని వల్ల హార్ట్ ఎటాక్, డయాబెటిస్, క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. బ్రెజిల్ నట్స్ లో అధికంగా ఉండే సెలీనియం రోగ నిరోధక వ్యవస్థకు కంచు కోటలా నిలుస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీని వల్ల తెల్ల రక్త కణాలు అధికంగా తయారవుతాయి. ఇవి శరీరంలో వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు చేరకుండా చూస్తాయి. రోగాల నుంచి రక్షిస్తాయి.

**హార్ట్ ఎటాక్ రాకుండా..**

బ్రెజిల్ నట్స్‌లో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు ఈ నట్స్‌లో అధికంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. హార్ట్ ఎటాక్ రాకుండా రక్షిస్తాయి. బ్రెజిల్ నట్స్ షుగర్ ఉన్నవారికి ఎంతగానో మేలు చేస్తాయి. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. దీంతో డయాబెటిస్ అదుపులో ఉంటుంది. బ్రెజిల్ నట్స్‌ను ఉదయం తినడం వల్ల రోజంతా శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. నీరసం, అలసట రావు. ఉత్సాహంగా పనిచేస్తారు. చురుగ్గా ఉంటారు. ఇలా ఈ నట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

## విధ్వంసం సృష్టించిన విండీస్ బ్యాటర్లు.. బెంబేలెత్తిపోయిన ప్రత్యర్థి బౌలర్లు

స్పోర్ట్స్ న్యూస్ ,16 జూన్ ( క్రాంతి న్యూస్ ):ఐర్లాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను పర్యాటక వెస్టిండీస్ 1-0 తేడాతో కైవసం చేసుకుంది. జూన్ 15న జరిగిన మూడో టీ20లో విండీస్ 62 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. ఈ సిరీస్‌లో మొదటి రెండు మ్యాచ్‌లు వర్షం కారణంగా టాస్ కూడా పడకుండానే రద్దు కాగా.. చివరి మ్యాచ్‌లో విండీస్ బ్యాటర్లు చెలరేగిపోయారు.



ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్.. ఓపెనర్లు ఎవిన్ లెవిస్ (44 బంతుల్లో 91బీ 7 ఫోర్లు, 8 సిక్సర్లు), షాయ్ హోప్ (27 బంతుల్లో 51బీ 4 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది.

లెవిస్, హోప్ తొలి వికెట్‌కు 122 పరుగులు జోడించి ఔటయ్యాక, హెట్‌మైర్ (7 బంతుల్లో 15బీ 3 ఫోర్లు), కీసి కార్టీ (22 బంతుల్లో 49 నాటౌట్‌బీ 4 ఫోర్లు, 4 సిక్సర్లు) తమదైన శైలిలో విరుచుకుపడ్డారు. ఆఖర్లో జేసన్ హోల్డర్ (13 బంతుల్లో 18బీ 2 ఫోర్లు, సిక్స్), రొమారియో షెపర్డ్ (6 బంతుల్లో 19 నాటౌట్‌బీ 3 సిక్సర్లు) కూడా బ్యాట్ ఝులిపించడంతో విండీస్ అతి భారీ స్కోర్ చేసింది.

ఐర్లాండ్ బౌలర్లలో మాథ్యూ హంఫ్రేస్ (4-0-16-2) ఒక్కడే విండీస్ బ్యాటర్ల ఊచకోతను తప్పించుకున్నాడు. మిగతా బౌలర్లంతా 12కు పైగా సగటుతో పరుగులు సమర్పించుకున్నారు. లియామ్ మెక్‌కార్టీకి (4-0-81-0) విండీస్ బ్యాటర్లు చెడుగుడు ఆడుకున్నారు.

ఫలితంగా అతను ఓ టీ20 ఇన్నింగ్స్‌లో రెండో అత్యధిక పరుగులు సమర్పించుకున్న బౌలర్‌గా చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. ఓ టీ20 ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు సమర్పించుకున్న చెత్త రికార్డు గాంబియా బౌలర్ మూసా జోబార్తే (4-0-93-0) పేరిట ఉంది.

అనంతరం భారీ లక్ష్య ఛేదనకు దిగిన ఐర్లాండ్.. ఎక్కడా విజయం దిశగా సాగుతున్నట్లు కనిపించలేదు. ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. ఓపెనర్ రాస్ అడైర్ (48) ఆ జట్టు ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. హ్యారీ టెక్టార్ (38), మార్క్ అడైర్ (31 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. వీరి తర్వాత అత్యధిక పరుగులు ఎక్స్‌ట్రాల రూపంలో (23) వచ్చాయి. విండీస్ బౌలర్లలో అకీల్ హొసేన్ 3, జేసన్ హోల్డర్ 2, రొమారియో షెపర్డ్, రోస్టన్ ఛేజ్ తలో వికెట్ తీశారు.

## డబ్ల్యూటీసీ 2025-27 సైకిల్‌కు ముహూర్తం



స్పోర్ట్స్ న్యూస్ ,16 జూన్ ( క్రాంతి న్యూస్ ): దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య రెండ్రోజుల క్రితమే లార్డ్స్‌లో జరిగిన ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్‌తో 2023-25 సైకిల్‌కు తెరపడింది. మూడో ఎడిషన్ విజేతగా దక్షిణాఫ్రికా నిలవగా.. ఫైనల్ ముగిసిన మూడు రోజులకే డబ్ల్యూటీసీ కొత్త సైకిల్ (2025-27) మొదలవనున్నది. ఈనెల 17 నుంచి శ్రీలంక.. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో గాలె వేదికగా జరుగబోయే టెస్టుతో నాలుగో ఎడిషన్ మొదలవనుంది. 9 దేశాలు పాల్గొననున్న ఈ ఎడిషన్‌లో మొత్తం 71 టెస్టులు జరుగనున్నాయి. కొత్త సైకిల్‌లోనూ ఆస్ట్రేలియా అత్యధికంగా 22 టెస్టులు ఆడనుండగా మరో అగ్రశ్రేణి జైట్టెన ఇంగ్లండ్ 21 టెస్టులు ఆడనుంది. వరుసగా రెండుసార్లు రన్నరప్‌గా నిలిచిన భారత జట్టు.. 18 టెస్టులు ఆడుతుంది. రోహిత్ శర్మ తప్పుకోవడంతో కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమ్‌ఇండియా.. ఈనెల 20 నుంచి ఇంగ్లండ్‌తో మొదలుకాబోయే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌తో డబ్ల్యూటీసీ 2025-27 టైటిల్ వేటను ఆరంభించనుంది. నాలుగో ఎడిషన్‌లో ఒక్కో జట్టు ఆరు సిరీస్‌లు (స్వదేశంలో 3, విదేశాల్లో 3) ఆడనుంది.

భారత షెడ్యూల్

గత ఎడిషన్‌తో పోల్చితే ఒక మ్యాచ్ తక్కువగా ఆడనున్న భారత జట్టు.. స్వదేశంలో 9, విదేశాల్లో 9 టెస్టులు ఆడనున్నది. సొంతగడ్డపై వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో తలా రెండు మ్యాచ్‌లు ఆడనున్న మెన్ ఇన్ బ్లూ.. వచ్చే ఏడాది ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది. విదేశాల్లో ఇంగ్లండ్‌తో ఐదు.. శ్రీలంక, న్యూజిలాండ్‌తో తలా రెండు టెస్టులు ఆడుతుంది.

టెస్టు క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు గాను ఐసీసీ నిర్వహిస్తున్న డబ్ల్యూటీసీ చాంపియన్‌షిప్స్ కొత్త ఎడిషన్‌లో కొన్ని హైప్రొఫైల్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య జరిగే యాషెస్ సిరీస్‌కు తోడు భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ, సౌతాఫ్రికా-ఆస్ట్రేలియా మధ్య జరుగబోయే మ్యాచ్‌లు అభిమానులను అలరించనున్నాయి. ఇక మూడో ఎడిషన్ విజేత అయిన దక్షిణాఫ్రికా.. ఈ ఏడాది అక్టోబర్‌లో పాకిస్థాన్‌తో జరుగబోయే టెస్టులతో తమ ప్రయాణాన్ని మొదలుపెట్టనుంది. గత ఎడిషన్‌లో 12 మ్యాచ్‌లే ఆడిన సఫారీలు.. నాలుగో ఎడిషన్‌లో 14 మ్యాచ్‌లు ఆడనున్నారు.

## యూటీటీ విజేత ముంబై.. ఫైనల్‌లో జైపూర్‌పై జయకేతనం





స్పోర్ట్స్ న్యూస్ ,16 జూన్ ( క్రాంతి న్యూస్ ): ప్రతిష్టాత్మక అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) ఆరో సీజన్‌లో యూ ముంబా జట్టు విజేతగా నిలిచింది. గత మూడు వారాలుగా క్రీడాభిమానులను అలరించిన ఈ టోర్నీ ఫైనల్‌లో యూ ముంబా జట్టు.. 8-4తో జైపూర్ పాట్రియాట్స్‌పై ఘనవిజయం సాధించి టైటిల్‌ను ఎగురేసుకుపోయింది. అహ్మదాబాద్‌లోని ఎకా ఎరీనా వేదికగా జరిగిన పురుషుల సింగిల్స్‌లో యూ ముంబా ఆటగాడు లిలియన్ బార్డెట్ 2-1 (4-11, 11-5, 11-7)తో కనక్ ఝాను ఓడించగా మహిళల సింగిల్స్‌లో బెర్నడెట్.. 2-1 (11-9, 10-11, 11-5)తో ఆకుల శ్రీజపై గెలిచింది.

మిక్స్‌డ్ డబుల్స్‌లో ముంబై ద్వయం ఆకాశ్, బెర్నడెట్.. 3-0 (11-6చ 11-5, 11-5)తో జీత్ చంద్ర, బ్రిట్ ఎర్లండ్‌ను ఓడించి టైటిల్‌ను ఖాయం చేసుకుంది. చివరి మ్యాచ్‌లో అభినానంద్ 1-2 (5-11, 8-11, 11-8)తో జీత్ చంద్ర చేతిలో ఓడాడు. యూటీటీలో ముంబై జట్టుకు ఇదే తొలి ట్రోఫీ కావడం విశేషం.

## చరిత్ర సృష్టించిన యాజిక్

స్పోర్ట్స్ న్యూస్ ,16 జూన్ ( క్రాంతి న్యూస్ ): ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన భారత యువ అథ్లెట్ హిల్లాంగ్ యాజిక్ చరిత్ర సృష్టించింది. భూటాన్ వేదికగా జరిగిన దక్షిణాసియా బాడీ బిల్డింగ్ అండ్ ఫిజిక్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో 25 ఏండ్ల యాజిక్ స్వర్ణంతో పాటు రజతం సాధించింది.

ఈ క్రమంలో ఆమె అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణం గెలిచిన తొలి అరుణాచల్ ప్రదేశ్ అథ్లెట్‌గా రికార్డులకెక్కింది. యాజిక్‌ను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఫెమా ఖండు, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రశంసల్లో ముంచెత్తారు.



KR TV క్రాంతి

మంగళవారం 17 జూన్ 2025

# సినిమా న్యూస్

epaper.krtvnews.com



## భూ అంటే భూతం..

నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ప్రెస్టేజియస్ మాస్ ఎంటర్టైనర్ 'తమ్ముడు'. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రధారులు. జూలై 4న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం ఈ సినిమా ఫస్ట్ సింగిల్ అనౌన్స్‌మెంట్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'భూ అంటే భూతం..' అంటూ సాగే ఈ పాటను ఈ నెల 17న సాయంత్రం 5 గంటలకు విడుదల చేయబోతున్నట్టు ఆదివారం ఓ ప్రకటన ద్వారా వారు తెలిపారు.



## రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రత్యేక సెట్లో..




'అఖండ 2: తాండవం' చిత్రం కోసం ఇటీవలే జార్జియాలో పోరాటాలు పూర్తి చేసుకుని స్వదేశానికి తిరిగొచ్చారు నందమూరి బాలకృష్ణ . ఇప్పుడాయన మరో కొత్త షెడ్యూల్ కోసం రంగంలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. రామోజీ ఫిల్మ్ సిటీలో సిద్ధం చేసిన ప్రత్యేక సెట్లో సోమవారం నుంచి ఈ కొత్త షెడ్యూల్ మొదలు కానుంది. దీనిలో భాగంగా బాలకృష్ణతో పాటు చిత్ర ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కించనున్నారు. ఇది ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సిద్ధమవుతోంది. బాలయ్య ఇందులో రెండు భిన్నమైన పాత్రల్లో అలరించనున్నారు. 'అఖండ'కు కొనసాగింపుగా రూపొందుతున్న ఈ చిత్రం దసరా సందర్భంగా సెప్టెంబరు 25న థియేటర్లలోకి రానుంది. బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి తమన్ సంగీతమందిస్తుండగా.. సి.రామ్‌ప్రసాద్, సంతోశ్ డిటాకే ఛాయాగ్రాహకులుగా వ్యవహరిస్తున్నారు.

## తిరస్కరణలే నా బలం!


'లోఫర్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యింది బాలీవుడ్ అందాల తార దిశా పటాని. వైవిధ్యమైన కథలతో కుర్రకారుని ఉర్రూతలూగించే ఈ భామ.. తన మొదటి సినిమా అనుభవాలను ఓ సందర్భంలో గుర్తుచేసుకుంది. "ఎన్నో ఆశలతో కేవలం రూ.500లతో ముంబయికి వచ్చాను. చాలా ఆడిషన్లకు వెళ్లేదాన్ని. ఎక్కువగా టీవీ వాణిజ్య ప్రకటనల కోసం వెళ్లాను. ఈ క్రమంలో ఒక సినిమాకు సంతకం చేశాను. అదే నా మొదటి చిత్రం. అది ప్రారంభం కావడానికి ముందే నన్ను తొలగించారు. నా స్థానంలో వేరొకర్ని తీసుకున్నారు. ఈ విషయంలో నేనేం బాధపడలేదు. కానీ ప్రతిదీ జరగడానికి ఒక కారణం ఉంటుంది. తిరస్కరణలే నన్ను మరింత బలంగా చేస్తాయని నమ్ముతుంటా" అని ఆనాటి సంగతులను పంచుకుంది దిశా. ప్రస్తుతం ఈమె ఖాతాలో 'హెూలీగార్డ్స్', 'వెల్‌కమ్ టు ది జంగిల్' చిత్రాలున్నాయి.

## ప్రభాస్ ది రాజా సాబ్ టీజర్ విడుదల..
## ఫ్యాన్స్‌కి పూనకాలే..

రెబల్ స్టార్ ప్రభాస్ 'సలార్', 'కల్కి 2898 ఏడీ' సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్న తర్వాత మారుతి దర్శకత్వంలో ది రాజా సాబ్ చిత్రం మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ఈ చిత్రంతో వింటేజ్ ప్రభాస్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తామని దర్శకుడు మారుతి చాలా బలంగా చెబుతున్నారు. 'ది రాజా సాబ్' నుంచి ఇప్పటి వరకు విడుదలైన స్టిల్స్ చూస్తే అభిమానుల్లో కూడా నమ్మకం బలపడింది. ది రాజా సాబ్ చిత్రం రొమాంటిక్ హారర్ కామెడీ జానర్‌లో రూపొందుతోంది. ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిధి కుమార్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రభాస్ అభిమానుల ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పెడుతూ టీమ్ తాజాగా దీని టీజర్‌ను విడుదల చేసింది. ప్రభాస్ వింటేజ్ లుక్‌లో కనిపించి ఆకట్టుకుంటున్నారు. హారర్ ఎలివేషన్స్, ఫన్నీ డైలాగులతో ఆసక్తికరంగా ఉంది .



## సైనికులతో 8 రోజులు ఉన్నాను..
## అలా ఉన్న ఏకైక నటుడిని నేనే: ఆమిర్ ఖాన్



'ఆపరేషన్ సిందూర్'పై స్పందించనందుకు బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ ఇటీవల విమర్శలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. సైనికులపై తనకున్న గౌరవాన్ని తెలిపారు. కార్గిల్ యుద్ధం జరిగిన తర్వాత వారితో 8 రోజులు ఉన్న సమయాన్ని గుర్తుచేసుకున్నారు. బంకర్‌లో ఒక రాత్రంతా ఉన్నట్లు చెప్పారు. అలా ఉన్న ఏకైక నటుడిని తానేనని అన్నారు.

"బహుశా ఈ విషయం అందరికీ తెలియకపోవచ్చు. కార్గిల్ యద్ధం గెలిచాక నేను అక్కడికి వెళ్లాను. ఎనిమిది రోజులు వారితో ఉన్నాను. అలా ఉన్న ఏకైక నటుడిని నేనే. లేహ్‌లో దిగాను, అక్కడినుంచి శ్రీనగర్‌కు వెళ్లే రోడ్డులో ఎనిమిది రోజులు ప్రయాణించాను. ప్రతి రెజిమెంట్‌నూ కలిశాను. ఆ ఎనిమిది రోజులు సైనికులను మాత్రమే కలిశాను. వారిని ప్రశంసించడానికి అక్కడికి వెళ్లాను. మాకోసం ఈ యుద్ధం చేసి రక్షించారు. మీకు మేమంతా రుణపడి ఉంటామని చెప్పాను. కానీ, నేను వారితో గడిపిన తర్వాత నాకు ఒక విషయం అర్థమైంది. వారికి నిజంగా ఎలాంటి ప్రోత్సాహం అవసరం లేదు. వారు ఎంత కష్టమైనా భరిస్తూ మనల్ని కాపాడడానికి సిద్ధంగా ఉన్నారు. అలాంటి వారు ఎంతోమందికి స్ఫూర్తి. వారికి మనోధైర్యాన్నివ్వాలని నేను కలిశాను. కానీ, వారే నా మనోధైర్యాన్ని పెంచారు. వారితో ఉన్నన్ని రోజులు కలిసి భోజనం చేశాను. వారి జీవితాల గురించి తెలుసుకున్నాను. ఒక రాత్రి సరిహద్దులోని బంకర్‌లో ఉన్నాను. నాతోపాటు 8 మంది సైనికులు కూడా ఆ బంకర్‌లో ఉన్నారు" అంటూ ఆ రోజులను ఆమిర్ గుర్తుచేసుకున్నారు.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com